క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

డుంబ్రిగుడ: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గురువారం ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై తహసీల్దార్ నాగమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఈవీఎంల ద్వారా ఓటు వేసి ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీటీ ముజీబ్, ఆర్ఐ హరి, రెవెన్యూ అధికారి కామరాజు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

వీఆర్ పురం: ఏటీఏ(ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో వి.వి.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా స్థానిక విద్యావనరుల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు కె.కన్నయ్య, కార్యదర్శి ఎం.కన్నయ్య, సిరమయ్య, ఎ.ప్రశాంత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు సూచనలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొయ్యూరు: మండలంలోని ఆడాకులలో గురువారం పతాంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీ మేనేజర్ తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. సహాయక మేనేజర్ కె.రమేష్ మాట్లాడుతూ పంట దిగుబడి పెంపుపై సూచనలిచ్చారు.పామాయిల్ సాగులో లాభాలు అధికంగా వస్తున్నాయన్నారు.దీనిలో మాజీ వైస్ ఎంపీపీ దివానం, ఏరియా ఇన్‌చార్జి నాగేశ్వరరావు, సర్పంచ్ కె.అప్పారావు, ఉప సర్పంచ్ కూనిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న గిరిజన అర్చక సేవా సంఘం ప్రతినిధులు

గూడెంకొత్తవీధి: అయోధ్య రామమందిర అక్షింతలను గురువారం భక్తులకు పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన వీటిని గురువారం మండల కేంద్రంలో వినాయకుని ఆలయం వద్ద గిరిజన అర్చక సేవా సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అందజేశారు. బలరాం, గణపతి, సురేష్, సన్యాసిరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



సీఐ రాంబాబు

వై.రామవరం: సంక్రాంతి పండుగ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదని అడ్డతీగల సీఐ వై.రాంబాబు హెచ్చరించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పేకాట, కోడి పందాలను ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రవాణా, సాగు, సారా తయారీ, విక్రయాలు చేయవద్దని సూచించారు.యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

సురక్షితంగా గమ్యానికి తల్లీబిడ్డ

- ప్రజా మన్ననలు పొందుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్
- మూడు వాహనాలతో మండలంలో విస్తృత సేవలు
- గిరిజనుల హర్షాతిరేకం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఆస్పత్రి నుంచి తల్లీ బిడ్డను ఇంటికి తరలిస్తున్న దృశ్యం





తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి చేరుకున్న తల్లీబిడ్డ



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో బాలింత,కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు: మన్యంలోని గ్రామస్తులకు ఆస్పత్రి సేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు.. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మండలంలో అన్ని చోట్ల సరైన రహదారులు ఉండేవి కావు. గ్రామాలకు 108, అంబులెన్స్ సేవలు అందేవి కావు... గర్భిణులు ప్రసవాలకు ఆస్పత్రికి వెళ్లేందుకు నానా అవస్థలు పడేవారు. గత్యంతరం లేక ఇళ్లల్లోనే ప్రసవాలు జరిగే పరిస్థితి ఉండేవి.. తల్లీబిడ్డల పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా ఏజెన్సీలో వైద్య సేవలపై టీడీపీ పాలకులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు.. గిరిజనులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది...అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యానికి పెద్దపీట వేసింది. ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు శ్రీకారం చుట్టింది. కోట్లాది రూపాయలతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో పాటు సబ్ సెంటర్ల ఏర్పాటు, ఆధునీకీకరణ పనులు చేపట్టింది. దీంతో పాటు ప్రతి గ్రామానికి 108, అంబులెన్స్ సేవలు అందుబాటులో వచ్చే విధంగా అభివృద్ధి పనులు చేసింది. ఇక గర్భిణులకు ఆస్పత్రిల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు అనంతరం తల్లీ బిడ్డను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు 'తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను అందుబాటులో తీసుకొచ్చింది. దీంతో ప్రభుత్వ సేవలపై గిరిజనులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం అయిన అనంతరం బాలింతలను, పుట్టిన బిడ్డలను సురక్షితంగా ఎటువంటి ఖర్చులేకుండా ఇంటికి చేర్చాలన్నదే సీఎం జగనన్న లక్ష్యం. దీంతో డాక్టర్ వైఎస్సార్ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రభుత్వం గతేడాది ఏప్రిల్ నెలలో అందుబాటులోకి తీసుకొచ్చింది. 102 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఆసుపత్రిలో ప్రసవం భర్త గాని, బంధువులు గాని ఫోన్ చేస్తే వాహనం అందుబాటులోకి వస్తుంది. అత్యాధునికమైన సౌకర్యాలతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు వాహనాలు ప్రభుత్వాస్పత్రుల నుంచి బాలింతలను బిడ్డతో సహా సురక్షితంగా ఉచితంగా ఇంటికి చేర్చుతున్నారు. ఆస్పత్రి నుంచి బయలుదేరినప్పుడు, ఇంటికి చేర్చినప్పుడు వారిని సురక్షితంగా చేర్చమని వాహనానికి సంబంధించిన కెప్టెన్ తల్లీబిడ్డలతో ఫోటో తీసికొని అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యతను కూడా కేటాయించారు. వాహనంలో జీపీఆర్ఎస్ వ్యవస్థ ఉండడంతో సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుంటారు. దీంతో వాహన రాకపోకలు ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో గిరిజన ప్రాంతంలో తల్లీబిడ్డలకు ఈ సేవలు ఉత్తమంగా అందుతున్నాయి. పేద గిరిజనులపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా తల్లీ బిడ్డలు ఎంతో సంతోషంగా గమ్యాస్థానాలు చేరుతున్నాయి. గతంలో ఆటోలు, జీపులను దూరం బట్టి రూ.1500 నుంచి రూ.5వేలు వరకు అద్దెతో తల్లీబిడ్డలను తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు సీఎం జగనన్న పాలనలో ఆ సమస్య తొలగిపోయిందని బాలింతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 1670 మందికి అందిన సేవలు

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలు ఉండగా 376 గ్రామాలు ఉన్నాయి. ఒక సీహెచ్‌సీ, మూడు సీహెచ్‌సీలలో మూడు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి.ముగ్గురు కెప్టెన్‌లు ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండగా వీటిలో ప్రసవం పొందిన బాలింతలు, పుట్టిన బిడ్డలు ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు పొందుతున్నారు. ఇప్పటి వరకు 1670మంది తల్లిబిడ్డలు ఈ ఎక్స్‌ప్రెస్‌లో ఇళ్లకు చేర్చగలరు. ఈ సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఆస్పత్రిలో ప్రసవం తర్వాత ఇంటికి బిడ్డను తీసుకువెళ్లేందుకు గతంలో మా ఊరివారు ఇబ్బందులు పడేవారు. ఆటో, జీపులను అద్దెకు తీసు వచ్చి తల్లీ, బిడ్డను ఇంటికి తీసువెళ్లాల్సిన పరిస్థితి ఉండేది.దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పేవి కావు. కాని ముఖ్యమంత్రి జగనన్న చొరవతో ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో సురక్షితంగా ఇంటికి వెళ్తున్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

రణ మాలతి, బాలింత, కొత్తసుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

సేవలు భేష్



ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న నిర్ణయం అద్భుతం.గిరిజన ప్రాంతంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి.గతంతో గర్భిణులను ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు, తల్లీ బిడ్డలను ఇంటికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు.గిరిజన ప్రాంతంలో 108,104,తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ సేవలను సులభతరం చేయడంతో గిరిజన మహిళలకు బాగా ఉపయోగపడుతున్నాయి.

– అరిసెల సీతమ్మ, ఎంపీపీ, ముంచంగిపుట్టు

అన్ని వేళల్లో అందుబాటులో సేవలు



ముంచంగిపుట్టులో మూడు వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా సేవలు అందిస్తున్నాం. గిరిజన ప్రాంతంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రిల్లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం . వాహనాలల్లో తల్లీబిడ్డలను ఎంతో సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాం. .వాహన కెప్టెన్‌లు కూడా ఎంతో సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు.

– రామ్‌సూరి, ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్. వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఐటీడీఏ పాడేరు

నేడు వైఎస్సార్ పింఛన్ పంపిణీ

చింతపల్లిరూరల్: మండలంలో వైఎస్సార్ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో ఎమ్మెల్యేల పర్యటన రేపు

కొయ్యూరు: మండల కేంద్రంలో శనివారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి పర్యటించి, పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీవో సీతయ్య తెలిపారు. ప్రజాప్రతినిధులకు సమాచారం అందించామని, అధికారులు హాజరుకావాలని కోరారు.

వై.రామవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శనివారం పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10గంటలకు మండలంలోని దేవరమడుగులు గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనాల ప్రారంభం, చవిటిదిబ్బలులో 11 గంటలకు, పి.యర్రగొండలో 12గంటలకు, వై.రామవంలో ఒంటి గంటకు గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పనసలపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పింఛన్‌తో పాటు, ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు, డీటీకే పట్టాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు కోరారు.

అభివృద్ధి పనులపై ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లిరూరల్: మండలంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు.మండల కేంద్ర సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో తలపెట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు హర్షణీయం



పింఛన్ సొమ్ము అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



పింఛన్లు పంపిణీ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

పాడేరు: మండలంలోని చింతలవీధి పంచాయతీ తలార్‌సింగి గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పంపిణీలో దేశంలో ఆంధ్రప్రదేశ అగ్రస్థానంలో ఉందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును రూ.3వేలకు పెంచడం హర్షణీయమన్నారు. పింఛన్ సొమ్ముతో అవ్వాతాతాలకు ఎంతో ఆర్థిక భరోసా కలిగిందన్నారు. కిడ్నీ రోగులకు, సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా రోగులకు నెలకు రూ.10వేల పింఛన్ ఇస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంగ్లన్నదొర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వి.బసవన్నదొర, సర్పంచ్ వి.రాంబాబు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దశమూర్తి. ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని నెల్లిపూడిలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మండలంలోని 4032 పింఛన్లకు నాలుగేళ్లలో రూ.64,56,24,000ల సొమ్ము అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో 70 మందికి కొత్త పింఛన్లు, 16 మంది గిరిజనులకు డీ-పట్టాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి పంపిణీ చేశారు. సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా జగనన్నను ముఖ్యమంత్రి గెలిపించాలని కోరారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం , వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు పి.కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ ప్రసాద్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రమణమ్మ, రామలక్ష్మి, కె.లక్ష్మి, మరిడమ్మ, ఎంఆర్ఐ జిలానీభాషా, ఎస్ఐ రామకృష్ణ, మండల పార్టీ కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌చార్జి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ పింఛన్ రూ.3వేలు పెంచడం హర్షణీయమన్నారు. దీంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

54 మందికి వైద్య పరీక్షలు



వివరాలు నమోదు చేస్తున్న దివ్యాంగులు

అరకులోయ రూరల్: మండల కేంద్రం మండల పరిషత్ అవరణలో ఎబిలిటి పీపుల్ సంస్థ డైరెక్టర్ దిలీప్‌పాత్రో ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 54 మందికి ఉచితంగా వైద్యం పరీక్షలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ తరఫున గ్రామాల్లో విస్తృతంగా వైద్యశిబిరాలు నిర్వహించి పేద దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు అందజేస్తున్నట్టు చెప్పారు. శిబిరాల్లో అర్హులను గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్న వారికి ఉచితంగా కృత్రిమ అందజేయనున్నట్టు తెలిపారు. విశాఖకు చెందిన వైద్యులు మోనాలిసా, లేఖ్య తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



గంగవరంలో పశువులకు టీకాలు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అక్కమ్మ



వేటమామిడిలో పశువుల వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ బొడ్డపాటి రాఘవ

గంగవరం: స్థానిక పశువైద్యశాల ఆవరణలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ కలుముల అక్కమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. నెల్లిపూడి వెటర్నరీ డాక్టర్ అప్పన్నబాబు మాట్లాడుతూ పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటువ్యాధులు సోకిన పశువులను మందకు దూరంగా ఉంచాలని సూచించారు. 332 పశువులకు టీకా వేసినట్టు చెప్పారు. రాజు, నాగేశ్వరరావు, బషీర్ బీబీ , వెంకటేశ్వరరావు, కీర్తన, గౌతమ్ రైతులు పాల్గొన్నారు.

అడ్డతీగల: వేటమామిడిలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.గణేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ బొడ్డపాటి రాఘవ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గణేష్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నోటిలో, కాళ్ళ డెక్కల మధ్య పుండ్లు ఏర్పడతాయని తక్షణమే వైద్యం అందించాలని సూచించారు. మండలంలోని పశువులన్నింటికీ టీకాలు వేసే కార్యక్రమం చేపడతామన్నారు. పశువైద్యాధికారి తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయకర్తలకు అభినందనలు



అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి అభినందనలు తెలుపుతున్న అరకు జెడ్పీటీసీ రోషిణి, నేతలు



అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న నేతలు



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జి విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి అభినందనలు వెల్లువెత్తాయి. మండల కేంద్రంలోని జరిగిన కార్యక్రమాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, అరకులోయ, పద్మాపురం, చినలబుడు ఎంపీటీసీలు ఆనంద్‌కుమార్, రాజ్‌కుమార్, పూర్ణచంద్, ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి, మండల పార్టీ అధ్యక్షులు ఎస్.రాంబాబు, మత్స్యకొండంనాయుడు, జిల్లా వ్యవసాయ సలహ మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, సభ్యుడు ఎం.కన్నాపాత్రుడు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.రాంబాబు,సర్పంచ్ రాంబాబు తదితరులున్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

అరకులోయ టౌన్: మండల కేంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు, బాలుర, కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణలు సిబ్బందితో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ సావిత్రబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, సిబ్బంది సుభాన్, దివ్యమౌనిక, రోజారాణి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనుపు ఉత్సవం

అనకాపల్లి:పట్టణంలోని గవరపాలెం శ్రీ గంగపరదేశమ్మ భవానీ భక్తులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అనుపు మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారి చండీయాగ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 52 రోజులపాటు జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. అమ్మవారి ఊరేగింపు గవరపాలెం పురవీధులగుండా సాగింది. మంగళవాయిద్యాలతోపాటు దేవతామూర్తుల నృత్య ప్రదర్శన, గిరిజన నృత్యాలు, కేళవాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీరాం, సభ్యులు శ్రీను, కె.సుబ్బు, వెంకట్, వర, మహేష్, గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, యుగంధర్ పాల్గొన్నారు.